

# 1

## పెద్దిభొట్ల సుబ్బరామయ్య

'నా అంతటి గొప్ప దురదృష్టవంతుడు ఈ సృష్టిలో ఉండడు' అన్నాడు పెరుమాళ్లు. అర్ధరాత్రి దాటి ఉంటుంది. ఊరి చివరి పాతకాలపు ఇల్లు. వరండాలో కొవ్వొత్తి వెలుతురు. పెరుమాళ్లు ఎప్పటిదో పాత కుర్చీలో కూర్చుని ఉండి మాట్లాడుతున్నాడు. చాలా నెమ్మదిగా... లో గొంతుకతో....

అని ఎదురుగా అతనిదే నీడ.....

'సృష్టిమొత్తంమీద... అని ఎందుకన్నానంటే....' అంటూ వివరణ కూడా ఇచ్చాడు. దురదృష్టవంతులు అదృష్టవంతులు అనేవారు మానవులలోనే కదా ఉంటారు? ఈ మానవులు భూమ్మీదనే తప్ప విశ్వాంతరాళంలో అసంఖ్యాక గ్రహాలలో మరెక్కడా లేనేలేరు కదా ? అందువల్ల సృష్టి అంతటిలోనూ.... అన్నా తప్పు లేదు ! అన్నాడు విచిత్రంగా నవ్వుతూ. అతని పక్కన నేలమీద ఒక సీసా - బహుశా చవకబారు మద్యం ఉంది. ఆ పక్కనే ఒక మరో చిన్న సీసా కూడా ఉంది.

'నువ్వేమి చదువుకున్నావు?' అని వినిపించిది ఒక విచిత్రస్వరం....

'పది... పదివరకు చదువుకున్నాను... తప్పాను...! అన్నాడు పెరుమాళ్లు.

'తర్వాత ?'

పెరుమాళ్లు వెంటనే ఏమీ సమాధానం చెప్పలేదు. గోడమీద ఏదో అదృశ్య దృశ్యాన్ని చూస్తున్న వాడిలా కొన్ని క్షణాలు గడిపి అప్పుడు మళ్లీ అన్నాడు.... పదో క్లాసు చదివి తప్పి కొన్నాళ్లు ఏ పనీ లేకుండా రికామీగా కూర్చున్నాను. ఇంట్లో సంపాదించేవాడు మా పెద్దన్నయ్య ఒక్కడే. తిని కూర్చునే వాళ్ళం ఆరుగురం.... పాపం, అన్నయ్య గొడ్డు చాకిరా చేసేవాడు. నాన్న మంచంలో..... అమ్మ నాన్న సేవలో.... కొన్నాళ్ళకు నేనూ ఏదో పని దొరుకుతుందేమోనని ఊరిమీద బయలుదేరాను. మొదలు ఒక పెద్ద స్టీలు సామాన్ల దుకాణానికి వెళ్ళాను. నేను గుమ్మం దాటి లోపల అడుగుపెట్టానో లేదో కరెంటు పోయింది.... సంధ్యవేళ.... లోపల

# నష్టజాతకుడు



కొద్దిపాటి అలజడి... పది నిముషాలసేపు అలాగే గడిచింది. నేను త్వరపడి అక్కడే ఉన్న షాపు యజమానితో 'ఏదన్నా పని దొరుకుతుందా?' అని అన్నాను. ఆయన విసుక్కుంటూ 'పో పోవయ్యా !' అని మాత్రం అన్నాడు. ఇంకేమీ అనలేదు. నేను వెంటనే గుమ్మం దిగి ఇవతలికి వచ్చేశాను. నేను గుమ్మం దిగానో లేదో కరెంటు వచ్చేసింది. మళ్ళీ అంతటా వెలుతురు. ఆ దుకాణదారు నా వెనక నుండి 'భలే పాదం....' అనడం వినిపించింది. అదే ప్రారంభం !!

"ఇంతకీ మీదే వూరు ?' అని మళ్ళీ ప్రశ్న వినవచ్చింది. పెరుమాళ్ళు మళ్ళీ నవ్వాడు. ఆ నవ్వు వికృతంగా లేదుకాని వింతగా మాత్రం ఉంది. విలక్షణంగానూ ఉంది. అతడు ఏమీ తోచని వాడిలా చేతివ్రేళ్ళు విరుచుకుని నవ్వుతూనే మొదలు పెట్టాడు. "ఎవరైనా పుట్టిన ఊరు ఏదని అడిగితే ఏదో ఒక ఊరిపేరు చెబుతారు. పుట్టిన వేళ అడిగితే కూడా ఏదో సమాధానం ఉంటుంది. కాని నా విషయంలో ఆ సదుపాయం లేదు.... ప్రళయభీకరంగా ఉరుములు పిడుగులు గాలివానా అన్నీ కలిసి బీభత్సం సృష్టిస్తున్న సమయంలో రెండు రైల్వేస్టేషన్ల మధ్య ఆగిపోయిన రైల్లో పుట్టానట నేను.... నేను భూమి మీద - అదే రైల్లో - పడేసరికి నన్ను కన్న మా అమ్మ స్పృహ కోల్పోయి మరి చాలాసేపు కళ్ళు తెరవనే లేదట...!

పెరుమాళ్ళు ఆగి నిట్టూర్చాడు.

తర్వాత చాలాసేపు కళ్ళార్పకుండా గోడమీద కదులుతున్న నీడను చూస్తూ ఉండిపోయాడు.

మళ్ళీ ఎందుకో ఉస్సురని నిట్టూర్చి మాటాడటం మొదలుపెట్టాడు.

స్టీలు సామాన్ల దుకాణం యజమాని 'ఏం పాదంరా బాబూ' అన్నాడా? ఆ తర్వాత ఆ మాట ఎంతసేపో మరిచిపోలేకపోయాను. అంతకు ముందు జరిగిన చిన్న చిన్న విషయాలు గుర్తు చేసుకుంటే విచిత్రమనిపించింది. ఎప్పుడైనా ఎక్కడైనా క్యూలో నిలబడితే ప్రతిసారీ అదేమి చిత్రమో నా దగ్గరికి వచ్చేసరికి అన్ని అయిపోయేవి. రేషన్‌కోసం నిలబడినా, తక్కువ తరగతి సినిమా హాల్లో క్యూలో నిలబడినా సరిగ్గా నావంతు వచ్చేసరికి 'నిల్' అనీ 'క్లోజ్‌డ్' అనీ బోర్డు పెట్టేసేవాళ్ళు. ఒకసారి మా ఊరి మోతుబరి ఆసామి దగ్గరికి నాన్న పంపితే వెళ్ళాను. నేను వెళ్లేసరికి సరిగ్గా ఆ పెళ్ళి ఇంటి ముందు పందిరి కాస్తా అగ్నికి ఆహుతి అయిపోతున్నది. ఇవన్నీ బేరీజు వేసుకుంటే నాపుట్టుకలోనే ఏదో లోపం ఉన్నదనీ నేను నష్టజాతకుణ్ణనీ తేల్చుకున్నాను. ఆ తర్వాత నాకు దయదలిచి పని యిచ్చిన వ్యాపారస్తులిద్దరు అతి తక్కువ వ్యవధిలో దివాలా తీశారు. క్రమంగా నా చరిత్ర చుట్టుపక్కల కూడా నలుగురికీ తెలిసిపోయింది !!

ఇక్కడ పెరుమాళ్ళు ఆగి మళ్ళీ చేతివ్రేళ్ళు విరుచుకుని ఆవులించాడు. ఇక తెల్లవారేందుకు అట్టే వ్యవధి లేదు.

చీకట్లు తిరిగి వెలుగు వ్యాపించడం మొదలయితే భళ్లున తెల్లవారుతుంది. సూర్యభగవానుడు అమితవేగంగా దిక్చక్రం పైకి పాకుతూ వస్తాడు. చీకట్లు తొలిగి వెలుగు కళ్లు మిరుమిట్లు గొలుపుతూ వేగంగా వ్యాపిస్తుంది. 'అందువల్ల...' అనుకున్నాడు పెరుమాళ్ళు.

'అందువల్ల... త్వరపడటం మంచిది....!' అనుకున్నాడు మళ్ళీ. లేచి పక్కనే ఉన్న మద్యం సీసా మూత తీశాడు. ఒక విధమైన వాసన వచ్చింది. దాన్లో కొంత క్రింద నేలమీద పారబోశాడు. దాన్ని ఒక పక్కన ఉంచుకున్నాడు. తర్వాత మరో సీసా - చిన్నది - అందుకుని దాని మూత తీశాడు. దాన్లోని ద్రవాన్ని ఈ మద్యం సీసాలోకి వంచుకున్నాడు. తర్వాత మూత ఉంచి బాగా కదిలించాడు. అక్కడే పక్కన ఉంచుకున్నాడు.

తర్వాత గుండెలమీద చేతులుంచుకుని పడుకుని కళ్లు మూసుకున్నాడు. కళ్ళు మూసుకుంటే అంతా చీకటే అనుకుంటాము కాని, కళ్లు మూసుకుంటేనే ఎక్కువ చూస్తాము. వెలుతురులో అయితే కొంచెమే కనబడుతుంది. కనబడేది మాత్రమే కనబడుతుంది. కళ్ళు మూసుకుంటే అంతా కనబడుతుంది. ఎదుటలేనిది కూడా కనబడుతుంది. గతం అంతాకూడా కనబడుతుంది.

అతడు కంటితుదలు తుడుచుకున్నాడు. అన్నట్లు కళ్ళ వెంట నీళ్ళొస్తున్నా యెందుకు?' అనుకున్నాడు. అంతా ముగిసిపోతున్నప్పుడు అంతా ముగిస్తున్నప్పుడు కన్నీళ్ళెందుకు? చిన్నప్పటినుంచి ఈ లోకమూ తన వాళ్ళనుకున్న వాళ్లూ, ఇతరులూ, పరాయివాళ్లూ అందరూ తనను చిన్నచూపు చూశారు. చిన్నప్పుడు స్కూలులో పెరిగాక మిత్రులు, పెద్దయ్యాక ఇరుగుపొరుగువారూ, తర్వాత తాను ఆశ్రయించిన వారూ అందరూ మినహాయింపు లేకుండా తనను చిన్నచూపు చూశారు. తనపాదం మంచిది కాదన్నారు. తనది నష్టజాతకం అన్నారు. తనకు రూపాయి ఎవరైనా దయతలచి యిస్తే వారివి వెయ్యి రూపా యలు పోతాయని ప్రచారం చేశారు. తనకు ఎవరైనా అన్నం పెడితే పెట్టినవారికి అన్నం పుట్టదనీ ప్రచారం చేశారు. ఇలా జీవితం అంతా నలభైఏళ్ల జీవితం గడిచిపోయింది. ఇక ఇప్పుడు ఏమీ మిగలలేదు. ఎక్కడికైనా పోయి బ్రతుకుదామంటే తనమీద తనకే నమ్మకం పోయింది. తాను కూడా నష్టజాతకుణ్ణని గాఢంగా నమ్ముతున్నాడిప్పుడు. ఇక ఎక్కడికి వెళ్ళీ చేసేదేమీ లేదు. తనను తాను అంతం చేసుకోవడం మంచిది... మళ్ళీ జన్మంటూ ఉంటే నష్టజాతకుడుగా కాకుండా అదృష్టజాతకుడుగా పుట్టవచ్చు. అన్నట్లుమళ్ళీ జన్మ అంటూ ఒకటి ఉంటుందా ? అనుకున్నాడు. లేకపోతే పోనీయ్. ఇంకా మంచిది అనీ అనుకున్నాడు.

అంతలో అతనికి చిత్రంగా నిద్రపట్టింది. అదేమి చిత్రమో క్షణాల వ్యవధిలో నిద్రాదేవత అమితాపేక్షతో అతన్ని తన చేతుల్లోకి తీసుకున్నది. అతనికి శుభ్రమైన నిద్ర పట్టింది. చుట్టూ నిశ్శబ్దం. కీచురాళ్ళ సవ్వడి తప్ప మరేమీ లేదు. అప్పుడు ఆ దారినే వచ్చాడు నారాయణ. కొద్దిగా తూలుతూ నడుస్తూ వచ్చాడు. వచ్చినవాడు తన దోవన తాను వెళ్ళకుండా ఆగి నిద్రపోతున్న పెరుమాళ్లు వంక చూశాడు. అతని పక్కన ఉన్న సీసా చూశాడు. అతని ముఖంలో చిరునవ్వు పొటమరించింది. తను అంతకు ముందు తాగింది చాలక నిషా చాలక అసంతృప్తిగా ఉన్నవాడికి పెన్నిధి లభించినట్టయింది. నిశ్శబ్దంగా పెరుమాళ్లు పక్కకు వెళ్ళి ఆ మద్యం సీసా అందుకుని త్వరత్వరగా మూత తీసి - పెరుమాళ్లుఎక్కడ నిద్ర లేచి గొడవపెడతాడో అన్న చింతకొద్దీ సీసా నోటికందించుకుని గడగడ తాగేశాడు. ఆ తర్వాత ఖాళీసీసా అవతల విసిరేసి తడబడే అడుగులతో వెళ్ళిపోయాడు. వెళ్లి వెళ్లి పది అడుగుల దూరంలో తుప్పల్లో చాపచుట్టగా పడిపోయాడు.

ఇక్కడ నష్టజాతకుడు గాఢంగా నిద్రపోతున్నా డింకా. ఇప్పుడిప్పుడే లేచేట్టు లేదు కూడా.